
తెలుగు దినపత్రిక
RNI APTEL/1999/00110
# కబురు
KABURU TELUGU DAILY
సంపుటి : 22 సంచిక : 231 | బుధవారం జూలై 31 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

పారిస్ ఒలింపిక్స్.. భారత హాకీ జట్టుకు రెండో విజయం

2 లో..

ఇదండీ..కబురు..





మా వాడిని ఢిల్లీలో ఐఏఎస్ కోచింగ్‌కు పంపిస్తున్నాం వదినా..!!

# వ్యవసాయం పండుగ..

## రాజకీయం కాదు.రైతు ప్రయోజనాలే ముఖ్యం

కబురు న్యూస్, హైదరాబాద్ జూలై 30

- రుణమాఫీతో మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నం
- ఇవాళ్టితో 12224.98 కోట్లు రుణాలు మాఫీ చేసినం
- కాంగ్రెస్ మాట ఇస్తే శిలాశాసనమని రుజువు చేశాం
- నెహ్రూ నుంచి శాస్త్రి వరకు ఆహార, దేశభద్రతకే ప్రాధాన్యం ఇచ్చారు
- ఆగస్టు నెలలో రూ. 2లక్షల లోపు రుణాలన్నీ మాఫీ అవుతయ్
- గత ప్రభుత్వం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టింది
- ఆ మిత్తి కింద ఇప్పటిదాకా 43 వేల కోట్లు కట్టినం
- అన్న పథకాలు అమలు చేస్తూనే రుణమాఫీ
- రెండో విడుత రుణమాఫీ సభలో సీఎం రేవంత్ రెడ్డి



2 లో

ఇప్పటి వరకు మొత్తం: 17,75,235 మంది రైతులు
మాఫీ మొత్తం: 12,224.98 కోట్లు

కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయం పండుగని నిరూపిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పుడు ఎన్నికలు లేవని, తమకు రాజకీయ ప్రయోజనాలు ముఖ్యమం కాదని, రైతుల ప్రయోజనాలే మా విధానమని సీఎం చెప్పారు. నెహ్రూ నుంచి శాస్త్రి వరకు ఆహార, దేశ భద్రతలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. అక్కడి నుంచే జై జవాన్.. జై కిసాన్ అనే నినాదం వచ్చిందని గుర్తు చేశారు. ఈ దేశంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలు 14 లక్షల కోట్ల రూపాయల బ్యాంకులకు ఎగవేశాయని గుర్తు చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతులు ఆ పనిచేయరని అన్నారు.

అప్పుల పాలైనా వ్యవసాయం వదలరని చెప్పారు. తెచ్చిన అప్పులు కట్టలేకపోతే తన పొలం దగ్గరికి పోయి పురుగుల మందు తాగి ఆత్మహత్యలు చే సుకుంటారని అన్నారు. వాళ్లకు అండగా నిలబడి ధైర్యం చెప్పడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. రైతులు ఆనందంగా ఉండాలని, సంక్షోభంలో కూరుకుపోవద్దని ఆ నాడు రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో రైతు డిక్లరేషన్ ప్రకటించామని, దానిని తూచా తప్పకుండా అమలుచేస్తున్నామని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే అది శిలాశాసనమవుతుందని అన్నారు. గత ప్రభుత్వం పదేండ్లు పాలించి రూ. లక్ష రుణమాఫీ చేయలేకపోయిందని అన్నారు. తమకు చిత్తశుద్ధి ఉన్నందునే సంకల్పాన్ని నెరవేర్చామని చెప్పారు. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఈ రాష్ట్రంలో రుణమాఫీ సాధ్యం కాదని చాలా మంది శాపనార్థాలు పెట్టారని గుర్తు చేశారు.

## అడవిని ఆధారంగా చేసుకుని బతికే కుటుంబాలు మావి : మంత్రి సీతక్క



కబురు న్యూస్, హైదరాబాద్ జూలై 30

కాంగ్రెస్ ప్రభుత్వం పోడు భూముల చట్టాల ద్వారా ఎస్టీలకు 2006లో లబ్ధి చేకూర్చిందని మంత్రి సీతక్క తెలిపారు. శాసనసభలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆమె మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస నేతలు ఎస్టీలకు ఏమీ చేయలేదని విమర్శించారు. పదేళ్ల పాలనలో ఎస్టీలకు ఎన్ని ఉద్యోగాలిచ్చారో... ఎంత మందికి ఇళ్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. తమ బడ్జెట్‌లో అందరికీ న్యాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు.భారాస పాలనలో ఎస్టీలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని సీతక్క విమర్శించారు. సీతక్క తల్లిదండ్రుల పోడుభూములపై సభలో భారాస ఎమ్మెల్యే ప్రశ్నించగా ఆమె స్పందించారు. చట్టప్రకారమే వారికి పోడుభూముల హక్కు వచ్చిందన్నారు. ఈరోజు కూడా తన తండ్రి అడవిలో పని చేసుకుంటున్నారని చెప్పారు. అడవిని ఆధారంగా చేసుకుని బతికే కుటుంబాలు తమవని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంతో మంది ప్రజాప్రతినిధులు రైతుబంధు తీసుకుంటున్నారని చెప్పారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్ట్: కీలక నేతలకు బిగుస్తున్న ఉచ్చు..



కబురు న్యూస్, హైదరాబాద్ జూలై 30

కీలక నేతలకు బిగుస్తున్న ఉచ్చు.. ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నేతలకు ఉచ్చు బిగిసే అవకాశం కనిపిస్తోంది. వెస్ట్ జోన్ డీజీపీ విజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు కారణం. ఫోన్ ట్యాపింగ్ కేస్ లో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతుందని, ఈ కేసులో ఎంతటివారినైనా వదిలిపెట్టేది లేదని, విచారిస్తామని అన్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న రాజకీయ నేతల వ్యవహారంపైన సాక్ష్యాలను సేకరిస్తున్నామని అన్నారు. సాక్షాలు వచ్చిన తర్వాత ప్రజాప్రతినిధులను పిలిచి విచారిస్తామని, ఇప్పటికే దాఖలు చేసిన చార్జిషీటును కోర్టు పరిగణలోకి తీసుకుందని అన్నారు. కేసులో కీలక నిందితులు ఇద్దరు విదేశాల్లో ఉన్నారని, వాళ్ళని ఇండియాకు రప్పించే ప్రయత్నం కొనసాగుతున్నాయని అన్నారు.

## విద్యుత్ విచారణ కమిషన్ ఛైర్మన్ గా జస్టిస్ మదన్ భీమ్ రావు



2 లో

## సొంత గూటికి చేరిన గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్

కబురు న్యూస్, హైదరాబాద్ జూలై 30



కాంగ్రెస్‌కు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి షాక్ ఇచ్చారు. తిరిగి బీఆర్ఎస్ గూటివైపే ఆయన అడుగులు పడుతున్నాయి. ఇవాళ అసెంబ్లీలో కేటీఆర్‌తో సమావేశమయ్యారు కృష్ణమోహన్ రెడ్డి. ఈ నెల 6న కాంగ్రెస్‌లో చేరిన కృష్ణ మోహన్ ఇప్పుడు దాన్ని ఖండిస్తున్నారు. తాను ఇప్పటికే బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, పార్టీ మారలేదని స్పష్టం చేస్తున్నారు. తాను కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని, ఆరోజు తన మెడలో ఉన్నది దేవుడి గుడికి సంబంధించిన కండువా అని కొత్త వాదన వినిపించారు. త్వరలోనే తాను కేసీఆర్‌ను కూడా కలుస్తానని చెప్తున్నారు. పార్టీ మారిన కృష్ణమోహన్‌రెడ్డి ఎందుకు యూటర్న్ తీసుకున్నారు.. నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులతో ఆయన వర్గం కలుపుకుని వెళ్లడంలో ఏమైనా ఇబ్బంది వచ్చిందా.. మరేదైనా కారణమా అనే దానిపై క్లారిటీ రావాల్సి ఉంది.

## శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద ప్రవాహం.. 5 గేట్లు ఎత్తి నీటి విడుదల



కబురు న్యూస్, హైదరాబాద్ జూలై 30 శ్రీశైలం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరదనీరు పోటెత్తుతోంది. సోమవారం 3 గేట్లను 10 మీటర్ల మేర ఎత్తి.. నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు.. తాజాగా మరో రెండు గేట్లను ఎత్తారు. దీంతో మొత్తం 5

# సంపాదకీయం

## అపనమ్మకంతో అభివృద్ధి ఎలా?

వికసిత భారత్ లక్ష్యమనీ, అందుకు వికసిత రాష్ట్రాలు కీలకమనీ కేంద్రం మాట. అందుకు అవరోధంగా రాజకీయంగా వివక్ష కొనసాగుతోందని రాష్ట్రాల ఆరోపణ. అందుకే, రాష్ట్రాల అభివృద్ధి, నిధుల కేటాయింపునకు కీలకమైన నీతి ఆయోగ్ సమావేశంలో బహిష్కరణల పర్వం కొనసాగడం ఆశ్చర్యం అనిపించదు. ప్రధాని మోదీ అధ్యక్షతన శనివారం సాగిన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ 9వ భేటీకి ఒకటీ రెండు కాదు... ఏకంగా పది ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ప్రతినిధులు గైర్హాజరయ్యారు. గత వారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2024–25 కేంద్ర బడ్జెట్‌లో తమ రాష్ట్రాల్లో ప్రాజెక్ట్‌లకు తగినన్ని నిధులు కేటాయించలేదంటూ తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జార?ండ్ రాష్ట్రాల సీఎంలు భేటీని బహిష్కరిస్తే, పశ్చిమ బెంగాల్ పక్షాన హాజరైన ఏకైక ప్రతిపక్ష పాలిత సీఎం మమతా బెనర్జీ సైతం మాట్లాడనివ్వకుండా మైకు ఆపేశారంటూ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అనుకున్నట్టే ఆ భేటీ కేంద్రం, రాష్ట్రాల మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. నీతి ఆయోగ్ ప్రాథమిక లక్ష్యాలు, పనితీరు పైన చర్చకు పురిగొల్పింది. కేంద్ర, రాష్ట్రాలు పరస్పర నిందారోపణలు మాని, నిజమైన సమాఖ్య స్ఫూర్తిని పాటించాల్సిన అవసరాన్ని గుర్తుచేసింది. ఈ నీతి ఆయోగ్ వ్యవస్థ ఎన్డీఏ తెచ్చిపెట్టినదే. తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు 2014లో కేంద్ర ప్రణాళికా సంఘం స్థానంలో దీన్ని ప్రవేశపెట్టారు. అలా 2015 జనవరి నుంచి ఇది అమలులోకి వచ్చింది. ప్రణాళికా సంఘమైతే పైన కేంద్రం నుంచి రాష్ట్రాలకు ఏకపక్షంగా విధాన నిర్ణయాలు బట్వాడా చేస్తుందనీ, దానికి బదులు కింది అందరినీ కలుపుకొనిపోతూ, రాష్ట్రాల ఆలోచనలకు పెద్దపీట వేసేందుకు ఉపకరిస్తుందనే ఉద్దేశంతో నీతి ఆయోగ్‌ను పెట్టారంటారు. కానీ, ఆచరణలో అందుకు విరుద్ధంగా జరుగుతోందన్నది ప్రధాన విమర్శ. వరుసగా మూడోసారి ఎన్డీఏ సర్కారు ఏర్పడిన తర్వాత ఈ జూలై 16న నీతి ఆయోగ్ మేధావి బృందాన్ని ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. ప్రధానమంత్రి మోదీ ఛైర్‌పర్సన్‌గా ఉండే ఈ బృందంలో నలుగురు పూర్తికాలిక సభ్యులతో పాటు, ఎన్డీఏలో భాగస్వాములైన బీజేపీ, దాని మిత్రపక్షాలకు చెందిన 15 మంది కేంద్ర మంత్రుల్ని ఎక్స్–అఫిషియో సభ్యులుగా చేర్చింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోమ్ మంత్రి అమిత్‌షా తదితరులు అందులో సభ్యులే. ఒకప్పటి ప్రణాళికా సంఘంలోనూ లోపాలున్నా... గ్రాంట్ల విషయంలో గతంలో రాష్ట్రాలతోసంప్రతింపులకు వీలుండేది. కానీ, ఇప్పుడు గ్రాంట్లపై ఆర్థికశాఖదే సర్వంసహాధికారం. ప్రణాళికా సంఘం ఉసురు తీసి వచ్చిన నీతి ఆయోగ్ కేవలం సలహా సంఘమైపోయింది. ఎంతసేపటికీ రాష్ట్రాల స్థానాన్ని మదింపు చేయడానికి కీలకమైన సూచికల సృష్టి మీదే దృష్టి పెడుతోంది. రాష్ట్రాలకూ, ఇతర సంస్థలకూ వనరుల పంపిణీ, కేటాయింపులు జరిపే అధికారం లేని వట్టి ఉత్సవ విగ్రహమైంది. వెరసి, కేంద్ర సర్కార్ జేబుసంస్థగా, పాలకుల అభీష్టానికి తలాడించే సవాలక్ష ఏజెన్సీల్లో ఒకటిగా దాన్ని మార్చేశారు. చివరకు 'సహకార సమాఖ్య' విధానానికి బాటలు వేస్తుందంటూ తెచ్చిన వ్యవస్థ అనూహ్యంగా 'పోటాపోటీ సమాఖ్య' పద్ధతికి దారి తీసింది. చివరకు మేధావి బృందపు పాత్ర ఏమిటన్న దానిపైనా ప్రశ్నలు తలెత్తాయి. వాటికీ సరైన జవాబు లేదు. అపనమ్మకం పెరిగితే వ్యవస్థలో చిక్కులు తప్పవని నీతి ఆయోగ్ భేటీ మరోసారి తేటతెల్లం చేసింది. అభివృద్ధికి సంబంధించిన వైఖరుల్లో పరస్పరం తేడాలున్నా, ప్రధానంగా భౌతిక ప్రాథమిక వసతుల నిర్మాణంపైనే అధికంగా ఖర్చు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ భావనకు సరిపోలేలా రాష్ట్రాలు కృషి చేయాలంటూ నీతి ఆయోగ్ తాజా భేటీలో 20 రాష్ట్రాలు, 6 కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతి నిధుల్ని ఉద్దేశించి ప్రధాని నొక్కిచెప్పారు. ఆర్థిక కార్యకలాపాలు చురుకుగా సాగాలంటే ప్రాథమిక వసతుల నిర్మాణం ప్రాధమ్యాంశమని కేంద్రం ఆలోచన. అందుకే, జాతీయ అభివృద్ధి లక్ష్యాల సాధనకు కేంద్రంతో రాష్ట్రాలు చేతులు కలిపి అటు వసతులకూ, ఇటు సంక్షేమానికీ వనరులు అందు కోవాలని ప్రధాని అంటున్నారు. అయితే, రాష్ట్రాల స్థానిక అవసరాలు, ప్రాధాన్యాలు ఎక్కడికక్కడ వేర్వేరు కాబట్టి, చెప్పినంత సులభం కాదది! పైగా, రాష్ట్రాలన్నిటికీ పెద్దపీటనే మాటకు భిన్నంగా ఆచరణలో పాలకపక్షం తమ ప్రభుత్వాలు ఉన్నచోటనే ప్రేమ చూపిస్తోందనే విమర్శ ఉండనే ఉంది.కేంద్ర బడ్జెట్‌ను సైతం అదే సరళిలో రాజకీయమయం చేశారని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఆరోపి స్తున్నాయి. తమిళనాట చెన్నై మెట్రో రైల్, కేరళలో విళింజమ్ పోర్ట్ సహా పలు కీలక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్‌లకు నిధులివ్వలేదని ఎత్తిచూపుతున్నాయి. ఈ అనుమానాలు, ఆరోపణలకు సంతృప్తికరమైన సమాధానాలు కేంద్రం వద్ద లేవు. అదే సమయంలో తాగునీరు, విద్యుచ్ఛక్తి, ఆరోగ్యం, పాఠశాల విద్య తదితర అంశాలే అజెండాగా సాగిన ఓ భేటీని బహిష్కరించడం వల్ల రాష్ట్రాలకూ, ప్రజానీకానికే నష్టం. ఆ సంగతి రాష్ట్రాలు గుర్తించాలి. బహిష్కరణను తప్పుబడుతున్న కేంద్ర పెద్దలు కూడా పరి స్థితి ఇంత దాకా ఎందుకు వచ్చిందో ఆత్మపరిశీలన చేసుకోవాలి. నీతి ఆయోగ్‌ను రద్దు చేసి, మునుపటి ప్రణాళికా సంఘమే మళ్ళీ తేవాలనే వాదన వినిపిస్తున్న వేళ వ్యవస్థాగతంగానూ, పని తీరులోనూ పాతుకున్న లోపాలను తక్షణం సవరించాలి. నిధులను సక్రమంగా, సమానంగా పంచ డంలో కేంద్ర ఆర్థిక మంత్రి, బడ్జెట్లు విఫలమవుతున్న తీరును మాటలతో కొట్టిపారేస్తే సరిపోదు. పెద్దన్నగా అన్ని రాష్ట్రాలనూ కలుపుకొనిపోతేనే వికసిత భారత లక్ష్యం సిద్ధిస్తుంది. పన్నుల రూపంలో భారీగా కేంద్రానికి చేయందిస్తున్న ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలూ ఇదే భారతావనిలో భాగమని గుర్తిస్తేనే అది కుదురుతుంది. అందుకు రాజకీయాలను మించిన విశాల దృష్టి అవసరం.

## విద్యుత్ విచారణ కమిషన్ చైర్మన్ గా జస్టిస్ మదన్ భీమ్ రావు

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ హయాంలో విద్యుత్ శాఖలో జరిగిన అవినీతి, అక్రమ ఒప్పందాలపై ఏర్పాటు చేసిన విద్యుత్ విచారణ కమిషన్ గా జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ ను నియమించింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం. కమిషన్ చైర్మన్ విషయంలో కేసీఆర్ దాఖలు చేసిన పిటీషన్ పై స్పందించిన సుప్రీంకోర్టు సూచనలు, సలహాలు చేసింది. ఈ క్రమంలోనే కమిషన్ కొత్త చైర్మన్ ను నియమిస్తున్నట్లు స్పష్టం చేసింది రాష్ట్ర ప్రభుత్వం.ఇందులో భాగంగానే 2024, జూలై 30వ తేదీన విద్యుత్ విచారణ కమిషన్ కొత్త చైర్మన్ గా జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది సర్కార్. గతంలో సుప్రీంకోర్టు జడ్జిగా.. ఉమ్మడి ఏపీలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు లోకూర్. ఇప్పటి విచారణ చేసిన నర్సింహారెడ్డి స్థానంలో.. ఇక నుంచి లోకూర్ విచారణ చేయనున్నారు.జస్టిస్ లోకూర్ 1977లో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఎల్.ఎల్.బి. డిగ్రీ పొందారు. ఆయన సుప్రీంకోర్టు, ఢిల్లీ హైకోర్టుల్లో న్యాయవాదిగా పనిచేశారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగ, రెవెన్యూ, సేవల చట్టాల్లో ఆయనకు అపారమైన అనుభవం ఉంది. 1998 జూలై 14న ఆయన అదనపు

# వ్యవసాయం పండుగ.. రాజకీయం కాదు రైతు ప్రయోజనాలే ముఖ్యం

మొదటి పేజీ తరువాయి

మాటా తప్పుతామని చాలా మంది అన్నారని కానీ ఇదీ మా చిత్తశుద్ధి అని నిరూపించామని చెప్పారు. జులై 18 నాడు మొదటి విడతలో లక్ష లోపు రుణాలున్న వారి లోన్లు మాఫీ చేశామని, ఇవాళ లక్షన్నర లోపు బాకీ ఉన్న రైతుల రుణాలను మాఫీ చేశామని చెప్పారు.

### రాష్ట్రాన్ని తాకట్టు పెట్టిన కేసీఆర్

గత ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని, ఆయన చేసిన అప్పులకు వడ్డీ కింద ఇప్పటి వరకు 43 వేల కోట్ల వడ్డీ కట్టామని సీఎం చెప్పారు. దీంతో ప్రతి నెలా మొదటి తారీఖున జీతాలు, పింఛన్లు ఇస్తున్నామని అన్నారు. వీటితోపాటు రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్య శ్రీ అమలు చేస్తున్నామని, ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లిస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు అనుమతి ఇవ్వడంతోపాటు అంగన్ వాడీల నుంచి ఆశవర్కర్ల వరకు జీతాలు సకాలంలో చెల్లిస్తున్నామని చెప్పారు.అప్పుల రాష్ట్రంలో ఇవన్నీ ఇస్తూనే 12,500 కోట్ల రూపాయల రుణమాఫీకి సర్దిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను, అధికారులను తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్టు చెప్పారు. ఆగస్టు నెల చరిత్రలో లిఖించదగినదని, ఆ నెలలో రైతుల రుణాలు పూర్తిగా తీరిపోతాయని చెప్పారు. 77 ఏండ్ల స్వాతంత్ర్య భారతంలో ఏ రాష్ట్రం కూడా 31 వేల కోట్ల రుణాలను మాఫీ చేయలేదని, తాము మాత్రమే చేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన మంత్రివర్గ సహచరులు, అధికారులకు సీఎం పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు .

**మొదటి విడుత రైతు రుణమాఫీ:11,34,412 మంది రైతులు**
**మాఫీ మొత్తం: 6,034.96 కోట్లు**
**రెండో విడుత: 6,40,823 మంది రైతులు**
**రైతు రుణమాఫీ: 6,190.01 కోట్లు**

# జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజె ధ్యేయం.

**- త్వరలో జర్నలిస్టులకు తీపి కబురు....**
**- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ....**



కబురు న్యూస్,హైదారాబాద్,జులై 31 :





విలేకరులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడమే కాకుండా,ట్రేడ్ యూనియన్ విది విధానాలపై అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ సూచించారు.మంగళవారం నాడు యూనియన్ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మియాపూర్ హోటల్ అశోక గ్రాండ్ లో నూతన రాష్ట్ర కమిటీకి ఆత్మీయ సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీలో రంగారెడ్డి,హైదరాబాద్,మేడ్చల్ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులకు శేరిలింగంపల్లి యూనియన్ జర్నలిస్టులు సత్కరించారు.రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన విరాహత్ అలీని,కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డిని,కోశాధికారి వెంకట్ రెడ్డిలను ఘనంగా సత్కరించారు ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎండి సలీమ్ పాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ,శేరిలింగంపల్లి శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.గడిచిన పదేళ్ల కాలంలో విలేకరుల సమస్యలు పరిష్కారానికి నోచుకోక అనేక ఇబ్బందుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.దేశంలో జర్నలిస్టుల గొంతుకగా పోరాటం చేస్తున్న కె.శ్రీనివాస్ రెడ్డికి ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ పదవిని అప్పగించడం ద్వారా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేసిందన్నారు.మీడియా అకాడమీ ఆధ్వర్యంలో మునుపెన్నడూ లేని విధంగా సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో విలేకరుల సమస్యలపై తరచుగా సమావేశాలు,చర్చలు జరుగుతున్నాయన్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జర్నలిస్టులు ఆరోగ్య పథకాన్ని కోల్పోవడంతో,సరైన వైద్య సదుపాయాలు అందక పలువురు విలేకరులు ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ,త్వరలోనే హెల్త్ కార్డులను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అర్హుడైన ప్రతి విలేఖరికి అక్రిడిటేషన్ అందాల్సిన అవసరం ఉందని,అయితే మార్కెట్లో విచ్చలవిడిగా ఎవరికి పడితేవారికి అక్రిడిటేషన్లు దొరకడం విచారకరమన్నారు.నికార్సైన జర్నలిస్టులు మార్కెట్లో అంగడి సరుకుగా మారిన అక్రిడిటేషన్లను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు.అర్హులైన జర్నలిస్టులందరికీ మండల జిల్లా కేంద్రాలుగా పరిగణలోకి తీసుకుంటూ,ఇళ్ల స్థలాలను మంజూరు చేసే విధంగా యూనియన్ కృషి చేస్తుందని స్పష్టం చేశారు.గతంలో ఓ సంఘం ప్రభుత్వం తమ జేబులో ఉందని చెప్పుకుంటూనే జర్నలిస్టులను మోసం చేసిందని ఆరోపించారు.ప్రభుత్వ పెద్దలు బహిరంగంగా ఎలాంటి ప్రకటనలు చేయనప్పటికీ పాలాభిషేకాలు చేస్తూ,లేనిపోని భ్రమలను కల్పించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇలాంటి సంఘాలతో జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి జాతీయ కౌన్సిల్ మెంబర్ సలీం మాట్లాడుతూ,జర్నలిస్టులో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారని,జర్నలిజం అనేది కొంతమంది వ్యక్తులకు వ్యాపార రంగంగా చూస్తున్నారని ఆయన తెలిపారు.కానీ జర్నలిజంలో అనేక సంవత్సరాలు పనిచేస్తూ కుటుంబంలో అటు సొసైటీలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలుగా నేడు జర్నలిస్టులకు గుర్తింపు ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.నికాసిగా పనిచేసే జర్నలిస్టు నిరంతరం అటు ప్రభుత్వ యంత్రాంగం ఇటు రాజకీయం అన్ని వర్గాల నుండి దాడులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు.జర్నలిజం కోసం పనిచేసిన ఎంతోమంది సీనియర్ పాత్రికేయులు అనేక భౌతిక విదారులకు గురై మరణించిన సంఘటన కూడా ఉన్నాయని ఆయన తెలిపారు.నిరంతరం ప్రజలకు వాస్తవాలను వెల్లడించడం కోసం అనునిత్యం కుటుంబానికి దూరమై ప్రజల మధ్య ఉండే వ్యక్తి కేవలం జర్నలిస్టు మాత్రమే అని ఆయన తెలిపారు.గత రాష్ట్ర ప్రభుత్వం పది సంవత్సరాలుగా జర్నలిస్టులకు ఇచ్చిన మాటను ఏ ఒక్కటే నెరవేర్చలేదని అందుకు జర్నలిస్టులు కూడా నిరంతరం పోరాటం చేశారని తెలిపారు.ఆ పోరాటంలో టీయూడబ్ల్యూజే ఎప్పుడు జర్నలిస్టు సమస్యల కోసం ముందుండి పోరాడిందని తెలిపారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం శాంతియుత మార్గంలో ప్రయత్నం చేస్తున్నామని ప్రభుత్వం జర్నలిస్టు సమస్యలు పరిష్కరించకపోతే పోరాటమే ఏకైక మార్గమని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబా,ప్రధాన కార్యదర్శి వై అశోక్ , రంగారెడ్డి,హైదరాబాద్,మేడ్చల్ జిల్లాల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి,శంకర్ శిగా,బాల రాజు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కిషన్,సత్యనారాయణ,శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు శ్రీనివాస్ రావు,నాగవేందర్ రెడ్డి,జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు గౌడ్,కార్యవర్గ సభ్యులు దారుగుపల్లి సత్యనారాయణ,సీనియర్ జర్నలిస్ట్ నాయకులు కొండా విజయ్ కుమార్,తిరుపతి రెడ్డి,మాధవ రెడ్డి,ప్రణయ్ ముదిరాజ్,అశోక్ యాదవ్,వరుణ్,డి శ్రీనివాస్,సాద నరేష్, ప్రవీణ్,గోవర్ధన్ రెడ్డి, నాగేష్,శంకర్,యాసిన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా పోస్టర్ల ఆవిష్కరణ

కబురు న్యూస్, కరీంనగర్, జూలై 31 :

ఆగస్టు ఒకటవ తారీఖున జరుపుకోబోయే ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం రోజున కరీంనగర్ పట్టణంలోని 37వ డివిజన్ పరిధిలోని మీకోసం కార్యాలయంలో ఆటో మాట్లాడుతూ,ఆగస్టు 1 న ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా పద్మా నగర్ లో జరిగే ఆటో డ్రైవర్ల జెండా ఆవిష్కరణ



# ఆరెకటిక సంఘం బోనాల ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్





## నృత్యం చేసి అలరించిన ఎమ్మెల్యే పోచారం,కార్పొరేషన్ చైర్మన్ కాసుల

కబురు న్యూస్ బాన్సువాడ జూలై 30

బాన్సువాడ మండల కేంద్రంలో మంగళవారం ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ముఖ్య అతిథిగా హాజరై బోనం ఎత్తుకొని అమ్మవారికి బోనాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాడ మాసంలో ప్రజలు మహిళలు భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతలను బోనాలతో సమర్పించుకుంటారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యంగా ఉండాలని గ్రామ దేవతలను ప్రార్థించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజును ఆరెకటిక సంఘం సభ్యులు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఆరెకటిక సంఘం ప్రతినిధులు హుసేన్, కిషన్, స్థానిక నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# శాసనసభ సమావేశాలకు హాజరుకాని ఎమ్మెల్యే పోచారం.... అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్



కబురు న్యూస్ బాన్సువాడ జులై 30

బాన్సువాడ నియోజకవర్గ ప్రజల ఆదరణతో అసెంబ్లీకి ఎన్నికైన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న శాసనసభకు హాజరు కాకపోవడం అవమానపరిచినట్టేనని అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన కబురు ప్రతినిధితో మాట్లాడుతూ ఎమ్మెల్యేలకు శాసనసభ దేవాలయం లాంటిదని శాసనసభకు సభాపతిగా పనిచేసిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బడ్జెట్ పై సమావేశాలు జరుగుతున్న సమయంలో నియోజకవర్గ సమస్యలను శాసనసభలో ప్రశ్నించేందుకు ఎందుకు వెళ్లడం లేదని ఆయన ప్రశ్నించారు. శాసనసభకు హాజరు కావాల్సిన ఎమ్మెల్యే గారు ఎందుకు వెళ్లడం లేదు.సభలో మర్యాద దొరకడం లేదా మైక్ ఇవ్వడం లేదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఒక పార్టీ గెలిచి అధికార పార్టీలోకి వెళ్ళినందుకే లోలోపల మదనపడుతున్నారా,శాసనసభ జరుగుతున్న సమయంలో నియోజకవర్గంలో బోనాల ఉత్సవాలు, చెక్కుల పంపిణీ చేసుకుంటూ ఇక్కడే ఉండటంలో మతాలబు ఏమిటో ప్రజలకు తెలియజేయాలన్నారు.ఎమ్మెల్యేగా లక్షల్లో వేతనాలు తీసుకుంటూ శాసనసభకు హాజరు కాకపోవడం పట్ల నియోజకవర్గ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఉద్యోగి తన విధులకు హాజరు కాకపోతే వేతనం నుండి కోత విధిస్తారో శాసనసభ్యులు సభకు హాజరు కాకపోతే వారి వేతనాలు నుండి కోత విధించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి శాసనసభ సమావేశాలకు హాజరై నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమపై చర్చించాలని ఆయన కోరారు.

# అనుమతులు లేకుండా చేసిన లేఅవుట్ ప్లాట్లను రద్దు చేయాలి... బిజెపి నాయకులు

కబురు న్యూస్ బాన్సువాడ జూలై 30

బాన్సువాడ పట్టణంలో విచ్చలవిడిగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే అవుట్ సదుపాయాలు కల్పించకుండానే పేద ప్రజలకు ప్లాట్లను విక్రయించి జేబులు నింపుకుంటున్నారని మంగళవారం బిజెపి అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, కోణాల గంగారెడ్డి అన్నారు. మంగళవారం రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ ను బిజెపి నాయకులు కలిసి అక్రమ ప్లాట్ల రిజిస్ట్రేషన్ వెంటనే రద్దు చేయాలని లే అవుట్ కానీ వెంచర్లకు రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని లేని పక్షంలో భాజాప పార్టీ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మున్సిపల్ కౌన్సిలర్లు అక్రమా లేఅవుట్లు, 10 శాతం భూములపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన



# రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల అమలుకై ఉద్యమిద్దాం...

## - సీపీఐ(ఎం-ఎల్)మాస్ లైన్ (ప్రజాపంథా)బోధన్ డివిజన్ నాయకులు..

కబురు న్యూస్,బోధన్ జులై 30..

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల అమలుకై ఉద్యమించాలని సిపిఐ(ఎం-ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలుపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు సిపిఐ (ఎం-ఎల్ ) మాస్ లైన్ (ప్రజా పంథా) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను పట్టణంలోని తట్టికోటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం-ఎల్)మాస్ లైన్(ప్రజా పంథా) బోధన్ డివిజన్ నాయకులు మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత దశాబ్ద కాలం నుండి కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో పేద ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అలాంటి వారందరికీ వెంటనే రేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు జీవన భృతి, వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, గీతా తదితర పింఛన్లను అందించాలన్నారు. సొంత స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి 10లక్షలు ఇవ్వాలని, స్థలం లేని వారికి డబుల్ బెడ్ రూమ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. రైతుబంధు డబ్బులను వెంటనే జమ చేయాలని,




వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం 12000 రూపాయలను అవసరాలకు అనుగుణంగా పెంచి ఇవ్వాలని, ధరణి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల అప్పులను 2 లక్షల రూపాయలు ఏకకాలంలో మాఫీ చేయాలంటూ తదితర డిమాండ్ల సాధన కోసం ధర్నా నిరసన కార్యక్రమాలను చేపట్టాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన సందర్భంగా ఆగస్టు 1నుండి రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాలలో, 8న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, ఆందోళనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పడాల శంకర్, సి.హెచ్. గంగారం, ఎస్.బాలయ్య, బి.సాయిలు, రాజు, శంకర్, సి.హెచ్. లక్ష్మీబాయి, అరుణ, సూర్య కళ, బి.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం,కార్పొరేషన్ చైర్మన్ కాసుల



## బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే పోచారం, కార్పొరేషన్ చైర్మన్ కాసుల

కబురు న్యూస్ బాన్సువాడ జూలై 30

బీర్కూర్ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన బోనాల ఉత్సవాలకు



మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ముఖ్య అతిథిగా హాజరై బోనం ఎత్తుకొని అమ్మవారికి బోనాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యంగా ఉండాలని గ్రామ దేవతలను ప్రార్థించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజును మున్నూరు కాపు సంఘ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు




బోయిని శంకర్, యమ రాములు, మియాపురం శశికాంత్, దొంతురం కాశిరాం, బోయిని గంగాధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీవోకు వినతి పత్రం అందజేసిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కబురు న్యూస్ బాన్సువాడ జూలై 30

ఉపాధి హామీ పథకాన్ని మున్సిపాలిటీలలో అమలు చేయాలని కోరుతూ మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్డీఓ రమేష్ రాథోడ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దుబాస్ రాములు మాట్లాడుతూ మున్సిపాలిటీలలో ఉపాధి హామీ పథకం లేకపోవడం వల్ల



# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం...

## కాంగ్రెస్ పార్టీ నాయకులు..

కబురు న్యూస్,బోధన్ జులై 30..

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, అసెంబ్లీ ఎన్నికలలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణ మాఫీ చేసి హామీ నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్ కొనియాడారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలుపుతూ బాణా సంచా కాల్చి, మిటాయిలు పంచి రైతు రుణ మాఫీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గంగాశంకర్ మాట్లాడారు. ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్న ఇచ్చిన రైతు రుణమాఫీ హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ప్రోత్సహించడానికి మరిన్ని సంక్షేమ పథకాలను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇచ్చిన హామీమేరకు రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని అన్నారు. రైతులు ఎటువంటి అపోహలకు గురి కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పట్టణ అధ్యక్షులు పాషా మొయినుద్దీన్, మాజీ సర్పంచ్, మండలం అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు హరికాంత్ చారి, జిల్లా అధికార ప్రతినిధి ప్రమోద్, కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, షర్ఫుద్దీన్, ఖలీం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.... మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు

కబురు న్యూస్ బాన్సువాడ జులై 30

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు అన్నారు. మంగళవారం బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డులో డ్రై డే ఫ్రైడే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు చైర్మన్ గంగాధర్ తో కలిసి వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల కలిగే ఇబ్బందులను ప్రజలకు వివరించారు. నీటి తొట్లలో నీరు నిల్వ ఉండరాదని దీనివలన దోమ కాటు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ పారే వేయకుండా మున్సిపాలిటీ నుండి వచ్చే చెత్త రిక్షాలోని చెత్తను వేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేటట్లు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. వినాయకుని ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు.అనంతరం బస్తీ దవఖానాను పరిశీలించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కౌన్సిలర్లు లింగమేశ్వర్, వెంకటేష్, నార్ల ఉదయ్, ఆర్పీలు, మహిళలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ఆశా వర్కర్లను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు..

కబురు న్యూస్ బాన్సువాడ జులై 30

బాన్సువాడ పట్టణం నుండి చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళుతున్న ఆశా వర్కర్లను మంగళవారం బాన్సువాడ పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రవీందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన ఉదృతం చేస్తామన్నారు. కార్మికులను ముందస్తు అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సాయిలు, రాజు, రాష్ట్ర నాయకులు పల్లవి, లావణ్య, సుమలత,కవిత, వరలక్ష్మి ,సక్కుబాయి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

# ఎమ్మెల్యే కార్పొరేషన్ చైర్మన్ కాసుల



ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

# బాన్సువాడలో మాంసం విక్రయాలపై అధికారుల పర్యవేక్షణ కరువు....

### ప్రజల ఆరోగ్యంతో చెలగాటమోడుతున్న మాంసం విక్రయదారులు...



**కబురు న్యూస్ బాన్సువాడ జులై 30**

మాంసం విక్రయదారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా చేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారు.. బాన్సువాడ పట్టణంలో మాంసం విక్రాయాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడంతో మాంసం వ్యాపారులు ఇష్ట రాజ్యంగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న సంబంధిత అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు లేకపోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మాంసం విక్రయ కేంద్రాల వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉండడం, ఇతర సౌకర్యాలు లేకుండానే మాంసం విక్రయాలు జరపడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కబేలాల వద్ద మాంసం విక్రయదారులు గొర్రెలను మేకలను వధించేందుకు మున్సిపాలిటీకి రుసుం చెల్లించాల్సి ఉన్నప్పటికీ నిబంధనలు ఎక్కడ కనిపించడం లేదు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించుకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వ్యాపారులు కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే చాలు మాసం తినేందుకు ఎంతోమంది ఇష్టపడతారు. ఎక్కడ మంచి మేకపోతు మాంసం దొరుకుతుందేమోనని ఆరా తీసి మరి కొనుగోలు చేస్తారు. మున్సిపాలిటీలో కబేలాలు గొర్రెలను మేకలను వధించడానికి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలి. నిబంధనలు తుంగలో తొక్కుతూ చనిపోయిన ఆరోగ్యంగా లేని గొర్రెలను మేకలను దుకాణాల ముందే వధిస్తున్నారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వధించడానికి ముందు మేకపోతుని తెచ్చుకొని వాటికి వాటర్ ఇంజక్షన్లు ఇస్తూ 20 కేజీలు ఉన్న మేకపోతు వాటర్ ఇంజక్షన్లు ఇవ్వడం వల్ల నాలుగు నుండి ఐదు కిలోల అధిక బరువు తయారు కావడంతో వాటర్ ఇంజక్షన్లతో కోసిన తర్వాత తూకంలో వ్యత్యాసం వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మేక మాంసం కిలో 750 కి అమ్ముతూ మేకకు వాటర్ ఇంజక్షన్ ఇవ్వడం వల్ల నాలుగు నుంచి ఐదు కిలోల మాంసం అదనంగా కావడంతో వినియోగదారుల జేబులకు మాంసం విక్రయదారులు చిల్లులు పెడుతున్నారు. ఇప్పటివరకు స్వతంత్ర సమరయోధుల జయంతులు నాడు మాంసం వధించరాదని నిబంధనలు ఉన్నప్పటికీ మహావీర్ జయంతి రోజు సైతం మాంసం విక్రయాలు యదేచ్ఛగా జరిపారు. మాంసం విక్రయదారులు నిబంధనలు తుంగలో తొక్కుతున్న అధికారులు కేసులు నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మాంసం విక్రయదారులపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరిపి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# డబుల్ బెడ్రూమ్ లు పంపిణీ చేయాలి....

**కబురు న్యూస్,బోధన్ జులై 30..**

బోధన్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ లనువెంటనే పంపిణీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. నిర్మించిన ఇళ్లను ఇవ్వకుండా నిరుపయోగంగా వదిలేయడంతో పూర్తిగా శిథిలావస్థలో కి చేరే అవకాశం ఉందని వెంటనే పట్టణంలో నివసించే నిరుపేదలకు ఆ ఇండ్లను కేటాయించాలని మంగళవారం బోధన్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్ కు వినతిపత్రం అందజేశారు. కోట్ల రూపాయలు వెచ్చించి సుమారు 446 ఇండ్లు శిథిలావస్థలో కి వెళ్ళే ప్రమాదం ఉందన్నారు. పేద ప్రజలు నిర్మించుకున్న డబుల్ బెడ్రూమ్ లు రెండో విడత బిల్లులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, వారికి రావలసిన రెండో విడత హౌసింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రామ కృష్ణ, కార్మిక విభాగం అధ్యక్షులు నాగుల రవిశంకర్ గౌడ్, యువజన నాయకులు జక్కు సంజు పాటిల్ పాల్గొన్నారు.



# విద్యార్థులలో నైపుణ్యాన్ని వెలికి తీయాలి... నోడల్ అధికారి విజయకుమార్

**కబురు న్యూస్ బాన్సువాడ జులై 30**

బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం మండల స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ విద్యా విధానాలపై విద్యార్థుల ప్రమాణాలను వెలికి తీసేందుకు అన్ని పాఠశాలలో మూడు 3,6,9 తరగతుల విద్యార్థులకు నవంబర్ నెలలో జాతీయస్థాయి సాధన సర్వే చేపట్టను నందున ఇప్పటినుండే ఉపాధ్యాయులు ప్రణాళికతో తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను అందుకు తగ్గట్టుగా విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలన్నారు. విద్యార్థుల్లో కనీస ప్రమాణాలను మెరుగుపరిచి జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు జాతీయస్థాయి సాధన సర్వే పరీక్షలు



# సన్ వే పాఠశాలలో ఘనంగా బోనాల పండగ ఉత్సవాలు





కబురు న్యూస్ బాన్సువాడ జులై 30
బీర్కూరు మండల కేంద్రంలోని సన్ వే ప్రైవేటు పాఠశాలలో మంగళవారం బోనాల పండగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నాగ పరమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి సాంప్రదాయాలను, పండుగల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు పండుగల ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, బోనాల ఉత్సవాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శేఖర్ యాదవ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకట సాయి పాఠశాలలో ఘనంగా బోనాల పండగ ఉత్సవాలు






కబురు న్యూస్ బాన్సువాడ జులై 30
నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని వెంకట సాయి విద్యానికేతన్ ప్రైవేటు పాఠశాలలో మంగళవారం బోనాల పండగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించి పాఠశాలలోని మైసమ్మ, కొచ్చేరు మైసమ్మ గ్రామదేవతలకు బోనాలను సమర్పించారు.. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి సాంప్రదాయాలను, పండుగల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు పండుగల ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని, బోనాల ఉత్సవాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చెస్ బాక్సింగ్ లో సత్తా చాటిన పోచారం రుశాంక్ రెడ్డి

కబురు న్యూస్ బాన్సువాడ జులై 30
పశ్చిమ బెంగాల్లోని కలకత్తాలోని ఖుదిరామ్ అనుషీలన్ కేంద్రంలో జరిగిన రెండవ ఆసియా చెస్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ సబ్ జూనియర్ పిట్ చెస్ బాక్సింగ్ ఫైనల్ పోటీల్లో కేరళకు చెందిన క్రీడాకారునిపై ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోచారం రుషన్ రెడ్డి రెండు బంగారు పథకాలు సాధించడంతో పోచారం కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి కుమారుడైన రుశాంక్ రెడ్డి చిన్ననాటి నుండి ఆటలపై మక్కువ చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తన మనవడు పోటీల్లో బంగారు పతకాలు



గెలవడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మున్ముందు జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.


# ఆరె కటికే సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ...

కబురు న్యూస్,బోధన్ జులై 30..
బోధన్ పట్టణ ఆరె కటికే సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను

హైదరాబాద్ ప్రెస్ అధ్యక్షులు గౌలికార్ నర్సింగ్ రావు, వికారాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ జయ నర్సింగ్ రావు, బోధన్ డివిజన్ అధ్యక్షులు రాజులాల్, మోహన్, గోపి, సాయి, రాజేశ్వర్, రాజేందర్, హుసేని, కిరణ్, రాకేష్, రాజశేఖర్, గంగా లాల్, సందీప్, కుల సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం.... ఎమ్మెల్యే కార్పొరేషన్ చైర్మన్ కాసుల




కబురు న్యూస్ బాన్సువాడ జులై 30
బాన్సువాడ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం నియోజకవర్గంలోని 187 మంది ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలను ఆదుకోవడం జరుగుతుందని, పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప వరమన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్, పోతంగల్, వర్ని మండలాల అధ్యక్షులు, తోట అరుణ్, పుప్పాల శంకర్, సురేష్ బాబా, మియాపురం శశికాంత్, బోయిని శంకర్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోతంగల్ లో ఒకరి దారుణ హత్య.....



కబురు న్యూస్ బాన్సువాడ జులై 30
పోతంగల్ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న మోతే లాలయ్య (58) అనే వ్యక్తి తన ఇంట్లోనే దారుణ హత్యకు గురయ్యారు. ఆరు నెలలుగా పక్షవాతం వచ్చి ఇంట్లోనే ఉంటున్న లాలయ్య సోమవారం రాత్రి తీవ్రంగా కొట్టి చంపినట్లు తెలుస్తుంది. కుటుంబ సభ్యులే కలిసి హత్య చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇద్దరినీ పోలీసులు అదుపులో తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బర్దిపూర్ గ్రామంలో ఘనంగా బోనాలు...




కబురు న్యూస్,బోధన్ జులై 30..
బోధన్ మండలంలోని బర్దిపూర్ గ్రామంలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు పుష్కలంగా పండి, ప్రజలందరూ సుఖశాంతులతో, చల్లగా ఉండాలని కోరుకుంటూ గ్రామ దేవతలు పోచమ్మ, మహాలక్ష్మి అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున మహిళలు బోనాలు ఎత్తుకుని బాజా బజంత్రీలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆయా కుల సంఘాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ధర్నా...

కబురు న్యూస్,బోధన్ జులై 30..




అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని ఆచన్ పల్లిలో గల ఇందూర్ మోడల్ స్కూల్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్, జిల్లా కన్వీనర్ దమా సునీల్ మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థి శుక్రవారం సాయంత్రం అదృశ్యమై నాలుగు రోజులు గడుస్తున్నా పాఠశాల నిర్వాహకుల నుండి ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు. విద్యార్థి తప్పిపోతే పాఠశాల యాజమాన్యం మాత్రం తమ వ్యక్తిగత పనులమీద తిరుగుతూ కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం



# జిగ్రా కోసం బాస్కెట్‌బాల్ శిక్షణ

కబురు సినిమా జూలై 30..

తన సోదరుడిని కాపాడుకోవడం కోసం ఓ అక్క చేస్తున్న పోరాటం ఆధారంగా రూపొందుతోన్న చిత్రం 'జిగ్రా'. బాలీవుడ్ కథానాయిక అలియా భట్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. వాసన్ బాలా తెరకెక్కిస్తున్నారు. ఇందులో వేదాంగ్ రైనా కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఇప్పటికే చిత్రీకరణను పూర్తి చేసుకున్న ఈ సినిమా నిర్మాణానంతర పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఆసక్తికర విషయం బయటికొచ్చింది. ఈ చిత్రంలోని తన పాత్ర కోసం అలియా.. బాస్కెట్‌బాల్ ఆటలో శిక్షణ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. "ఈ సినిమా కథాంశానికి బాస్కెట్‌బాల్‌కి సంబంధించిన సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. ఇప్పటికే ఈ ఆట కోసం వేదాంగ్, అలియా శిక్షణను ప్రారంభించారు. చిత్రంలో ఈ గేమ్‌ని వీరిద్దరి జీవితంలో ఓ ముఖ్యమైన భాగంగా చూపించబోతున్నారు. ఈ ఆట కోసం వచ్చే కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను మెప్పిస్తాయి. త్వరలో వివరాల్ని వెల్లడించనున్నార"ని అలియా సన్నిహిత వర్గాలు తెలిపాయి. కరణ్ జోహార్, అపూర్వ మెహతా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా అక్టోబరు 11న విడుదల కానుంది. ప్రస్తుతం 'ఆల్ఫా' సినిమాతో బిజీగా ఉంది అలియా.

# దర్శకుల సంఘానికి నా సహకారం



కబురు సినిమా జూలై 30..

"తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం తమ సభ్యులకు ఆరోగ్య బీమా, మధ్యాహ్న భోజన వసతి కల్పించడం మంచి ప్రయత్నం. ఈ సంఘానికి నా సహకారం ఎప్పటికీ ఉంటుంది" అన్నారు ప్రముఖ కథానాయకుడు విజయ్ దేవరకొండ. ఇటీవల హైదరాబాద్‌లో తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం దర్శక సంజీవని మహోత్సవం పేరుతో ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సభ్యులకు ఆరోగ్య బీమా కార్డుల్ని అందజేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయ్‌తోపాటు, నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "చిత్ర పరిశ్రమలో అందరం కలలు కంటూ ముందుకు సాగుతుంటాం. స్థిరమైన ఆదాయం ఉండదు. భవిష్యత్తుపై భరోసా ఉండదు. ఆ కష్టాలు ఎలా ఉంటాయో హీరోగా ఎదగకముందు నేనూ చూశా. దర్శకత్వ విభాగంలోనూ సినిమానే ప్రపంచంగా ఎంతో మంది డ్రీమర్స్ కొనసాగుతున్నారు. వాళ్లందరి సంక్షేమం కోసం దర్శకుల సంఘం పలు కార్యక్రమాల్ని చేపడుతోంది" అన్నారు. ఈ కార్యక్రమంలో పరుచూరి గోపాలకృష్ణ, తమ్మారెడ్డి భరద్వాజ, వీరశంకర్, సాయిరాజేశ్, మెహర్ రమేశ్ తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

# ధరణి.. నా కోసమే పుట్టిందేమో



కబురు సినిమా జూలై 30..

"అన్ని రకాల వాణిజ్యాంశాలతో నిండిన కవితాత్మక చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. ఈ కథలో ప్రకృతి ఒక ఫిలాసఫీగా ఉంటుంది" అంది నటి మోక్ష. 'లక్కీ లక్ష్మణ్' చిత్రంతో తెలుగు తెరకు నాయికగా పరిచయమైన ఆమె.. ఇప్పుడు 'అలనాటి రామచంద్రుడు'తో అలరించేందుకు సిద్ధమైంది. కృష్ణ వంశీ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని చిలుకూరి ఆకాశ్ రెడ్డి తెరకెక్కించారు. ఈ సినిమా ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మోక్ష సోమవారం హైదరా బాద్‌లో మాట్లాడుతూ "విశ్వజనీనమైన క్లాసిక్ ప్రేమకథతో రూపొందిన చిత్రమిది. ఇందులో నా పాత్ర పేరు ధరణి. చాలా చలాకీగా.. అల్లరి పిల్లలా కనిపించే పాత్రిది. ప్రతి అమ్మాయి రిలేట్ చేసుకునేలా ఉంటుంది. దర్శకుడు నాకీ కథ చెప్పినప్పుడు ఈ పాత్ర నా కోసమే పుట్టిందేమో అనిపించింది. ఈ సినిమా కోసం నేను చాలా సవాళ్లు ఎదుర్కొన్నా. మనాలిలో మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో నీటిలో దిగి చిత్రీకరణలో పాల్గొన్నా"అని చెప్పింది.

# నెమలి.. ఆయుధం పడితే అడ్డే లేదు

కబురు సినిమా జూలై 30..




సున్నితత్వం, క్రూరత్వం కలయిక ఆ జాతి. కత్తులు, డాలులు వీరి ఆయుధాలు! ఆయుధం చేతపడితే క్రూరత్వానికి అడ్డే లేదు. పన్నగ జాతికి చెందిన వారి వీరత్వం ఎలాంటిది? నారీకోన మహారాణి పన్నగ, ఆమె కుమార్తె వీరనారి నెమలి కథేమిటో తెలియాలంటే 'కన్నప్ప' చూడాల్సిందే. భక్త కన్నప్ప జీవితం ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. మంచు విష్ణు ప్రధాన పాత్రధారి. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. మోహన్‌బాబు నిర్మాత. అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్, శరత్‌కుమార్, బ్రహ్మానందం, మధుబాల తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. ఈ చిత్రంలోని మధుబాల లుక్‌ని సోమవారం విడుదల చేశారు. 'చేపట్టిన కత్తులు వాళ్ల విజయాన్ని చెక్కుతాయి... అడ్డు పెట్టిన డాలులు శత్రుదాడిని అడ్డుకుంటాయి. మాతృస్వామ్య వ్యవస్థ ఆనవాళ్లు... నారీకోన మహారాణి పన్నగ...' అంటూ పాత్ర నేపథ్యాన్ని పరిచయం చేసింది చిత్రబృందం. ఇందులో వీరనారి నెమలి పాత్రలో మధుబాల నటిస్తున్నారు.

# 'షూటింగ్ వదిలి.. విదేశాలకు వెళ్దామనుకున్నా': టర్నింగ్ పాయింట్ చెప్పిన మను బాకర్

కబురు క్రీడలు జూలై 30..

పారిస్ ఒలింపిక్స్ వేదికగా 124 ఏళ్ల రికార్డును తిరగరాస్తూ.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో పతకాలను సొంతం చేసుకొని భారత్‌కు మధుర విజయాన్ని అందించింది మను బాకర్ .ఈ రోజు టీమ్ విభాగంలో సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి కాంస్య పతకం సొంతం చేసుకున్న తర్వాత.. తన ప్రదర్శన పట్ల ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంది. ఇలా రెండు రోజుల వ్యవధిలో రెండు పతకాలు సాధించిన మను ఒక దశలో షూటింగ్‌ను వదిలేద్దామనుకుందట. 2023 వరకు అదే ఆలోచనలో ఉందట."ఆ రోజు నా జీవితంలో టర్నింగ్ పాయింట్. 2023లో ఒకరోజు కోచ్ నాతో మాట్లాడుతూ.. జీవితంలో ఏం చేద్దామనుకుంటున్నావని అడిగారు. వెంటనే తెలియదని సమాధానం ఇచ్చాను. ఒకట్రెండు సంవత్సరాల్లో షూటింగ్‌ను వదిలేసి పై చదువుల కోసం విదేశాలకు వెళ్లొచ్చు అని అన్నాను. దానికి కోచ్ నుంచి వచ్చిన స్పందన ఎంతగానో మోటివేట్ చేసింది" అని మను వెల్లడించారు. "నువ్వు ప్రపంచస్థాయి బెస్ట్ షూటర్‌వని నమ్ముతున్నాను. ఇక తర్వాత




నీ ఇష్టం. నిర్ణయం నీదే" అని ఆ రోజు కోచ్ చెప్పిన మాటలు మనుపై బలమైన ప్రభావం చూపాయి. తొలి కాంస్యం గెలిచిన తర్వాత ఈ స్టార్ షూటర్ మీడియాతో మాట్లాడుతూ చెప్పిన మాటలివి.

"మరి మీరు నా స్థానంలో ఉంటే ఏం చేస్తారు..?" అంటూ ఆమె వెంటనే కోచ్‌ను అడిగేసింది. అప్పుడు కోచ్ చెప్పిన మాటలు ఆమెలో మరింత కసిని పెంచాయి. "ఒలింపిక్స్ పతకమా, ఇంకోటా అని చూడకుండా, వెనక్కి తిరిగి చూడటం మానేసి.. నా కల నెరవేరేవరకు ఈ స్థానంలో ఉండేందుకు నిర్విరామంగా శ్రమిస్తాను" అని బదులిచ్చారట. ఇక పతక పోరులో మను అసలు స్కోర్ గురించి పట్టించుకోలేదు.

# పారిస్ ఒలింపిక్స్.. భారత హాకీ జట్టుకు రెండో విజయం



పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు రెండో విజయాన్ని నమోదు చేసింది. 2-0 గోల్స్ తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. దీంతో పూల్-బిలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. పెనాల్టీ కార్నర్, పెనాల్టీ స్ట్రోక్‌లను గోల్స్‌గా మలచి.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ జట్టుకు కీలక